ప్రజాతీర్పు - 2024 -

ప్రచారం ముగిసిన వెంటనే

ధ్యాన ముద్రలోకి మోదీ

30న కన్యాకుమారికి చేరుకోనున్న ప్రధాని

న్యూఢిల్లీ, మే 28: లోక్‌సభ ఎన్నికల ప్రచార పర్వం ముగిసిన తర్వాత ప్రధాని మోదీ రెండు రోజుల పాటు ఆధ్యాత్మిక కార్యక్రమంలో నిమగ్నం కానున్నారు. అందులో భాగంగా ఆయన తమిళనాడులోని కన్యాకుమారి చేరుకుని వివేకానంద రాక్ మెమోరియల్‌లో జూన్ 1వ తేదీ వరకు ధ్యానంలో గడుపుతారు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్న క్రమంలో అప్పటివరకు ప్రశాంతంగా గడపాలని మోదీ యోచిస్తున్నారు. మే 30 నుంచి జూన్ 1వ తేదీ వరకు కన్యాకుమారి ధ్యాన మండపంలో గడుపుతారని అధికార వర్గాలు తెలిపాయి. గతంలోనూ ఎన్నికల ప్రచారం ముగియగానే ప్రధాని ఆధ్యాత్మిక యాత్రలు చేశారు. 2014లో శివాజీ ప్రతాగర్, 2019లో కేదార్‌నాథ్‌లను సందర్శించారు.

కేజ్రీవాల్ వినతి.. సుప్రీంకోర్టు నో

న్యూఢిల్లీ, మే 28: వైద్య పరీక్షల నిమిత్తం తన మధ్యంతర బెయిల్‌ను వారం పాటు పొడిగించాలని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ చేసిన అభ్యర్థనను అత్యవసరంగా విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. పిటిషన్‌ను ఎప్పుడు విచారించాలన్న అంశంపై సీజేఐ చంద్రచూడ్ నిర్ణయం తీసుకుంటారని సుప్రీం కోర్ట్ వెకేషన్ బెంచ్ మంగళవారం వెల్లడించింది. ఈ పిటిషన్‌ను మధ్యంతర బెయిల్‌ను విచారిస్తున్న బెంచ్ ఉన్నప్పుడు గతవారమే ఎందుకు దాఖలు చేయలేదని కోర్టు ప్రశ్నించింది. అయితే, కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా అనేక వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉందని కేజ్రీవాల్ న్యాయవాది కోర్టుకు తెలిపారు.

ఆప్ నేత ఆతిశీకి కోర్టు సమన్లు

న్యూఢిల్లీ, మే 28: బీజేపీ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో ఢిల్లీ మంత్రి, ఆప్ నేత ఆతిశీకి ఢిల్లీ కోర్టు సమన్లు జారీ చేసింది. జూన్ 29న తమ ముందు హాజరు కావాలని ఆదేశించింది. ఆప్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని ఆతిశీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేత ప్రవీణ్ శంకర్ కపూర్ ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో పరువు నష్టం దావా వేశారు. బీజేపీ చేరాలంటూ ఆ పార్టీ నేతలు తనపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని, చేరకపోతే ఈడీ అరెస్ట్ చేస్తుందని బెదిరిస్తున్నారని ఆతిశీ గతంలో ఆరోపించారు.

100 వారెంట్స్ లెక్కచేయని

ఎస్పీ ఎమ్మెల్యే ఎట్టకేలకు అరెస్ట్

1997లో తొలి వారెంట్

లక్నో, మే 28: ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే రఫీక్ అన్సారీకి 100 సార్లు నాన్ బెయిలబుల్ వారెంట్స్ జారీ అయినా ఖాతరు చేయలేదు. దీంతో సోమవారం ఎట్టకేలకు యూపీ పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. మీరట్ సిటీ ఎమ్మెల్యే అయిన అతడికి 1997లో మొదటి వారెంట్ జారీ అయ్యింది. 1995 నాటి అల్లర్ల కేసులో ఆయనపై క్రిమినల్ నేరారోపణలు నమోదయ్యాయి. ట్రయల్ కోర్టు నుంచి 100 సార్లు వారెంట్స్ జారీ అయినా ఆయన లెక్కచేయలేదు. చివరికి రాష్ట్ర హైకోర్టు కలుగజేసుకొని.. ఎమ్మెల్యేను అరెస్టు చేయాలని ఆదేశించడంతో బారాబంకిలో అరెస్టు చేశారు.

తమిళనాడు డిప్యూటీ సీఎంగా

ఉదయనిధి స్టాలిన్?

చెన్నై, మే 28: క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి ఉదయనిధి త్వరలో తమిళనాడు డిప్యూటీ సీఎంగా పదవీ బా ధ్యతలు చేపట్టనున్నారని అధికార డీఎంకే వర్గాలు తాజాగా వెల్లడించాయి. జూన్ రెండో వారంలో మొదలుకానున్న అసెంబ్లీ సమావేశాల వేళ ఆయనకు డిప్యూటీ సీఎం పదవి దక్కుతుందని మంగళవారం వార్తలు వెలువడ్డాయి. ఇక, అన్నా డీఎంకే కంచుకోటైన సేలం జిల్లాలో ఏకైక డీఎంకే ఎమ్మెల్యే రాజేంద్రన్‌ను క్యాబినెట్‌లో తీసుకుంటారని తెలిసింది.

టైటానిక్ శకలాలు చూసేందుకు

మరో సాహసయాత్ర!

యాత్రకు సిద్ధమైన అమెరికా బిలియనీర్ లారీ కానర్

వాషింగ్టన్, మే 28: సముద్రంలో టైటానిక్ శకలాల్ని చూసేందుకు గతేడాది కొంతమంది జరిపిన సాహస యాత్ర (మినీ జలాంతర్గామి 'టైటాన్') విషాదాంతమైన సంగతి తెలిసిందే. సంచలనం సృష్టించిన ఈ ఘటన మరువకముందే, ఇప్పుడు అదే తరహాలో మరో సాహసయాత్ర చేపడుతున్నట్టు అమెరికాలోని ఓహియో రాష్ర్టానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి లారీ కానర్ ప్రకటించారు. 'ట్రిటాన్ సబ్‌మెరైన్స్' సహ వ్యవస్థాపకుడు ప్యాట్రిక్ లాహేతో కలిసి ఆయన సముద్రంలో 12,500 అడుగుల లోతుకు వెళ్లనున్నారు. ఈ సాహసయాత్ర కోసం 20 మిలియన్ డాలర్లు (సుమారుగా రూ.166 కోట్లు) ఖర్చు చేసి మినీ జలంతర్గామి 'ట్రిటాన్ 4000/2'ను వారు సిద్ధం చేసుకున్నారు.

ఉడుకుతున్న నగరాలు

- పెరుగుతున్న పట్టణీకరణే ప్రధాన కారణం
- నగరాల్లో ప్రమాదకర స్థాయికి 'హీట్ ఇండెక్స్'
- హైదరాబాద్ సహా మెట్రో నగరాలకు ముప్పు
- రాత్రుళ్లు సైతం నగరాల్లో 60% ఎక్కువ వేడి
- రెండు అధ్యయనాల్లో కీలక అంశాలు వెల్లడి

న్యూఢిల్లీ, మే 28: కాంక్రీట్ జంగిళ్లుగా మారిపోతూ, వేగంగా పచ్చదనం కోల్పోతున్న దేశంలోని నగరాలు ప్రమాదకర స్థాయిలో వేడెక్కుతున్నాయి. మనుషుల ఆరోగ్యంపై ప్రభావం చూపించే స్థాయికి ఉష్ణ సూచిక(హీట్ ఇండెక్స్) చేరుకుంటున్నది. గాలి ఉష్ణోగ్రత, భూ ఉపరితల ఉష్ణోగ్రత, అధిక తేమ వాతావరణం వల్ల నగరాల్లో వేడి కారణంగా వచ్చే అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. రాత్రిపూట సైతం వాతావరణం వేడిగానే ఉంటున్నది. దేశంలోని నగరాల్లో పెరుగుతున్న ఉష్ణోగ్రతపై సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్(సీఎస్‌ఈ), ఐఐటీ భువనేశ్వర్ చేసిన రెండు వేర్వేరు అధ్యయనాలు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. వెంటనే అప్రమత్తం కాకపోతే భవిష్యత్తు మరింత ప్రమాదకరంగా మారుతుందని హెచ్చరిస్తున్నాయి.

ప్రమాదానికి చేరువలో హీట్ ఇండెక్స్

ఢిల్లీకి చెందిన సీఎస్‌ఈ దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, హైదరాబాద్, చెన్నై, బెంగళూరులో 2001 జనవరి నుంచి 2024 ఏప్రిల్ వరకు నమోదైన ఉష్ణోగ్రతలు, వాతావరణంపై అధ్యయనం చేసింది. ఇందులో ప్రధాన నగరాల్లో ఏటా ఉష్ణ సూచిక పెరిగిపోతున్నదని తేల్చింది. అసలైన ఉష్ణోగ్రతకు తోడుగా తేమను పరిగణనలోకి తీసుకొని ఎంత వేడిగా ఉందో ఉష్ణ సూచికతో లెక్కిస్తారు. ఇది 41 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉంటే మనుషుల ఆరోగ్యానికి ప్రమాదకరం. ప్రధాన నగరాల్లో హీట్ ఇండెక్స్ ప్రమాదకర స్థాయికి దగ్గరలో ఉన్నది. ప్రస్తుతం వేసవిలో సగటున చెన్నైలో 37.4 డిగ్రీలు, కోల్‌కతాలో 36.5 డిగ్రీలు, ముంబైలో 34.3 డిగ్రీలు, ఢిల్లీలో 32.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 29.3 డిగ్రీలు, బెంగళూరులో 26.9 డిగ్రీల సెల్సియస్ హీట్ ఇండెక్స్ నమోదవుతున్నది.

పెరుగుతున్న నిర్మాణాలు.. తగ్గిన పచ్చదనం

పెరుగుతున్న పట్టణీకరణకు, వేడి ఒత్తిడికి మధ్య సంబంధం ఉందని అధ్యయనం గుర్తించింది. గత రెండు దశాబ్దాలుగా ఈ నగరాల్లో వేగంగా కాంక్రీట్ నిర్మాణాలు జరిగాయని, పచ్చదనం తగ్గిపోయిందని ఫలితంగా వేడి పెరుగుతున్నదని తెలిపింది. గత రెండు దశాబ్దాల్లో చెన్నై బిల్ట్‌అప్ ఏరియా(నిర్మాణాలు) రెండింతలైంది. ముంబైలో 2003లో 38.4 శాతంగా ఉన్న బిల్ట్‌అప్ ఏరియా 2023 నాటికి 52.1 శాతానికి చేరుకుంది. ఇదే సమయంలో పచ్చదనం మాత్రం 35.8 శాతం నుంచి 30.2 శాతానికి తగ్గింది. బెంగళూరులో బిల్ట్‌అప్ ఏరియా 37.5 శాతం నుంచి ఏకంగా 71.5 శాతానికి పెరిగింది. చెన్నైలో 30.7 శాతం నుంచి 73.5 శాతానికి పెరిగింది. పచ్చదనం 34 శాతం నుంచి 20.3 శాతానికి పడిపోయింది.

వర్షాకాలంలోనూ తగ్గని వేడి

సాధారణంగా వర్షాకాలం ప్రారంభానికి ముందు కంటే వర్షాకాలంలో వాతావరణం చల్లగా ఉండాలి. కానీ గత పదేండ్లుగా ఈ పరిస్థితి మారిపోతున్నది. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నైలో ఉష్ణ సూచిక వర్షాకాలానికి ముందు కంటే వర్షాకాలంలో ఎక్కువగా ఉంటుండగా, హైదరాబాద్, బెంగళూరులో మాత్రం కొంత చల్లగానే ఉంటున్నదని సీఎస్‌ఈ గుర్తించింది. మొత్తంగా 2001 – 10తో పోలిస్తే గత పదేండ్లలో వర్షాకాలంలో సగటున 1 డిగ్రీ సెల్సియస్, వర్షాకానికి ముందు ప్రీ మాన్‌సూన్‌లో 0.5 డిగ్రీల సెల్సియస్ వేడి పెరిగింది.

అత్యవసర చర్యలు అవసరం

ప్రస్తుతం భారత జనాభాలో 36 శాతం(40 కోట్లు) పట్టణ జనాభా ఉండగా, 2050 నాటికి ఇది రెట్టింపు అవుతుందని, 80 కోట్ల మంది పట్టణాల్లో నివసిస్తారని వరల్డ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ అంచనా వేస్తున్నది. ఈ నేపథ్యంలో నగరాల్లో వేడిని తగ్గించడానికి నీటి వనరులను, పచ్చదనాన్ని పెంచాలని పేర్కొన్నది. వేడిని ఉత్పత్తి చేస్తున్న కాంక్రీట్ ఉపరితలం, వాహనాలు, పరిశ్రమలు, ఏసీ వంటి వాటి వినియోగం, నిర్వహణలో మార్గదర్శకాలు రూపొందించాలని పేర్కొన్నది. సాధారణంగా ఆరోగ్యపరమైన అత్యవసర చర్యలు తీసుకునేటప్పుడు కేవలం పగటిపూట ఉష్ణోగ్రతలనే పరిగణనలోకి తీసుకుంటున్నారని, రాత్రి ఉష్ణోగ్రతలు, తేమను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది.

హైదరాబాద్ కొంత మెరుగు

ఇతర మెట్రో నగరాలతో పోల్చుకుంటే హైదరాబాద్ పరిస్థితి మెరుగ్గా ఉంది. నగరంలో 2003లో 20.6 శాతంగా ఉన్న బిల్ట్‌అప్ ఏరియా 2023 నాటికి 44 శాతానికి పెరిగింది. 2003లో 8.9 శాతంగా ఉన్న పచ్చదనం 2023నాటికి ఏకంగా 26.5 శాతానికి పెరిగింది. గత పదేండ్లలో తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున హరితహారం కార్యక్రమం చేపట్టడం, అర్బన్ ఫారెస్టుల అభివృద్ధి వంటి ప్రయత్నాలు ఫలించినట్టు ఈ లెక్కలను బట్టి అర్థమవుతున్నది.

రాత్రి పూటా సెగలే

సాధారణంగా పగటి పూట వేడి కారణంగా భూఉపరితల ఉష్ణోగ్రత వేడెక్కుతుంది. రాత్రివేళ చల్లబడుతుంది. 2001 – 2010 మధ్య పగటిపూట గరిష్ఠ ఉష్ణోగ్రతతో పోలిస్తే 6.2 డిగ్రీల సెల్సియస్ నుంచి 13.2 డిగ్రీల సెల్సియస్ వరకు భూఉపరితల ఉష్ణోగ్రత తగ్గేది. 2014 – 23 మధ్య మాత్రం 6.2 డిగ్రీల సెల్సియస్ నుంచి 11.5 డిగ్రీల సెల్సియస్ వరకు మాత్రమే రాత్రిపూట భూఉపరితల ఉష్ణోగ్రత తగ్గుతున్నదని సీఎస్‌ఈ పేర్కొన్నది. పట్టణీకరణ ఎక్కువవడమే ఈ పరిస్థితికి కారణమని ఐఐటీ భువనేశ్వర్ గుర్తించింది. పట్టణాలు, నగరాల్లో ఎక్కువగా విస్తరించి ఉండే కాంక్రీట్, తారు పగటిపూట వేడిని గ్రహించి రాత్రిపూట వదులుతున్నదని, ఫలితంగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని తేల్చింది. మరోవైపు దేశంలోని 140 ప్రధాన నగరాలపై అధ్యయనం చేసిన ఐఐటీ భువనేశ్వర్ పరిశోధకులు.. గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణాల్లో రాత్రిపూట 60 శాతం ఎక్కువ వేడి ఉంటున్నదని గుర్తించారు.

ఖాతాలో 8 వేలు జమంటూ వదంతులు

పోస్టాఫీసుకు పోటెత్తిన మహిళలు

- రాజకీయ పార్టీలు రూ.8 వేలు వేస్తున్నాయని తప్పుడు ప్రచారం
- బెంగళూరులో బారులు

బెంగళూరు, మే 28: కర్ణాటకలోని బెంగళూరులో పుకార్లు షికార్లు చేశాయి. కొన్ని రాజకీయ పార్టీలు పోస్టాఫీస్ ఖాతాలకు రూ.8 వేలు జమ చేయనున్నాయన్న తప్పుడు ప్రచారం విస్తృతంగా జరుగడంతో సోమవారం వేలాది మంది మహిళలు బెంగళూరు జనరల్ పోస్టాఫీస్(జీపీవో)కు పోటెత్తారు. తెల్లవారుజామున 3 గంటల నుంచే మహిళలు గుమిగూడటం ప్రారంభించారు. దీంతో భారీ సంఖ్యలో వచ్చిన వాళ్లను అదుపు చేసేందుకు జీపీవో అధికారులు పోలీసుల సాయం తీసుకోవాల్సి వచ్చింది. వచ్చిన వాళ్ల కోరిక మేరకు కొత్త ఖాతాలు తెరిచేందుకు అదనపు సిబ్బందిని రప్పించారు. ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంక్ కింద ఖాతా తెరిచిన ప్రతి ఖాతాలో పోస్టల్ శాఖ డబ్బును డిపాజిట్ చేస్తుందని గత వారం రోజులుగా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతున్నది. ఇది రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ గ్రూపుల్లో వైరల్‌గా మారింది. రిజిస్ట్రేషన్‌కు సోమవారం చివరి రోజు అని ప్రచారం జరగడంతో భారీ సంఖ్యలో మహిళలు జీపీవోకు వచ్చారు. దీనిపై జీపీవో చీఫ్ పోస్టు మాస్టర్ హెచ్‌ఎం మంజేశ్ స్పష్టత ఇచ్చారు. పోస్టల్ శాఖ అలాంటి కార్యక్రమాన్ని ప్రారంభించలేదని చెబుతూ ఎంట్రీ గేట్ల వద్దనే పోస్టర్లు కూడా అతికించామని చెప్పారు.

మోదీ ప్రభుత్వం పోయినా..

దేశ ఆర్థిక విధానాల్లో మార్పు ఉండదు: రఘురాం రాజన్

న్యూఢిల్లీ, మే 28: ప్రధాని నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చినా, రాకపోయినా భారత్.. తన ఆర్థిక విధానాలను ఇలాగే కొనసాగించే అవకాశం ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. మంగళవారం 'బ్లూంబర్గ్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. భారత విధానాల్లో కొనసాగింపు ఉంటుందని, ఏ ప్రభుత్వం వచ్చినా వీటిని కొనసాగిస్తుందని ఆయన పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే బడ్జెట్‌ను ప్రకటిస్తుందని, ప్రస్తుతం అమలులో ఉన్న మంచి అంశాలను కొనసాగిస్తూనే ఇంకా ఏమైనా మార్పులు చేసేందుకు ప్రయత్నించడంపై దృష్టి పెట్టవచ్చని ఆయన తెలిపారు. భారత్‌లో మౌలిక సదుపాయాలకు సంబంధించిన భారీ లోటుపాట్లు ఉన్నందున, ఇక మీదట కూడా మౌలిక వసతుల నాణ్యతపై దేశం దృష్టి పెట్టాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ పెట్టుబడి కేవలం కొన్ని ప్రధాన పారిశ్రామిక సంస్థలకు లాభం చేకూర్చేలా మాత్రమే ఉండొద్దని అన్నారు.

ఇలాంటివి జరుగుతుంటాయ్!

- రాజ్‌కోట్ అగ్నిప్రమాదంపై నవ్వుతూ చెప్పిన గేమ్‌జోన్ యజమాని సోలంకి
- పశ్చాత్తాపలేమిపై స్థానిక కోర్టు ఆగ్రహం

రాజ్‌కోట్: గుజరాత్‌లోని రాజ్‌కోట్ అగ్నిప్రమాద ఘటనకు సంబంధించి టీఆర్‌పీ గేమ్ జోన్ యజమాని, నిందితుడు యువరాజ్ హరి సింగ్ సోలంకి పశ్చాత్తాపం లేకుండా ప్రవర్తించాడు. 'ఇలాంటి ఘటనలు సాధారణంగా జరుగుతుంటాయి' అని నవ్వుతూ వ్యాఖ్యానించడంపై స్థానిక కోర్టు సోమవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఘటనపై విచారం వ్యక్తం చేస్తున్నట్టుగా కనిపిస్తూ కోర్టులోకి ప్రవేశించిన సోలంకి.. కొద్ది క్షణాల్లోనే నవ్వడం ప్రారంభించాడని, ఈ తరహా ఘటనలు జరుగుతుంటాయని వ్యాఖ్యానించారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తుషార్ గోకని పేర్కొన్నారు. అగ్నిప్రమాద ఘటనలో అరెస్టు చేసిన సోలంకితో సహా ముగ్గురు నిందితులను పోలీసులు స్థానిక కోర్టులో ప్రవేశపెట్టారు. వీరిని న్యాయ స్థానం 14 రోజుల కస్టడీకి అప్పగించింది. దర్యాప్తునకు నిందితులు సహకరించడం లేదని, ఏ పత్రాల గురించి అడిగినా సమాధానాన్ని దాటవేస్తున్నారని, అవి మంటల్లో కాలిపోయాయని చెబుతున్నారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తుషార్ గోకని పేర్కొన్నారు. కాగా, రాజ్‌కోట్ అగ్నిప్రమాదంలో గేమ్ జోన్ సహ యజమానుల్లో ఒకరైన ప్రకాశ్ హిరన్ కూడా మరణించినట్టు అధికారులు ధ్రువీకరించారు. ఈ మేరకు డీఎన్‌ఏ పరీక్షలో తేలిందని తెలిపారు.

భారత్‌తో ఒప్పందాన్ని పాక్ ఉల్లంఘించింది

లాహోర్ డిక్లరేషన్‌పై ఆ దేశ మాజీ ప్రధాని షరీఫ్ అంగీకారం

లాహోర్, మే 28: భారత్–పాకిస్థాన్ మధ్య కుదిరిన '1999 లాహోర్ ఒప్పందాన్ని' పాక్ ఉల్లంఘించిందని ఆ దేశ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ అంగీకరించారు. నాటి భారత ప్రధాని వాజ్‌పేయి, తాను ఆ ఒప్పందంపై సంతకాలు చేశామని, అయితే ఆ ఒప్పందాన్ని అప్పటి అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్ ఉద్దేశపూర్వకంగా అతిక్రమించారని ఆరోపించారు. మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ '1998, మే 28న పాకిస్థాన్ ఐదు అణు పరీక్షలు నిర్వహించింది. దాంతో వాజ్‌పేయి మా దేశానికి వచ్చి శాంతి ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ ఆ తర్వాత ఆ ఒప్పందాన్ని మేమే అతిక్రమించాం. అది మా తప్పే' అని ఆయన ఒప్పుకున్నారు.

రాష్ట్ర హైవేలు, పట్టణ రోడ్లపై

ద్విచక్ర వాహనాలకు ప్రత్యేక లేన్లు

కేంద్ర రవాణా శాఖ ప్రణాళిక

న్యూఢిల్లీ, మే 28: రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకొన్నది. రాష్ట్ర రహదారులు, పట్టణ రోడ్లపై ద్విచక్ర వాహనాల కోసం ప్రత్యేక లేన్లు నిర్మించేందుకు సంబంధించిన ముసాయిదా ప్లాన్‌ను సిద్ధం చేస్తున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. దేశంలో అధిక రోడ్డు ప్రమాదాలకు కారణంగా ఉన్న ట్రాఫిక్‌ను వేరుచేయడం దీని ప్రధాన లక్ష్యమని పేర్కొన్నాయి. ఇందులో భాగంగా పట్టణ ప్రధాన రహదారులపై పాదచారుల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లు నిర్మించనున్నట్టు తెలిపాయి. దేశంలో చోటుచేసుకొంటున్న దాదాపు 44 శాతం రోడ్డు ప్రమాదాలు, మరణాలకు టూవీలర్లే కారణంగా ఉంటున్నాయని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

దళిత కుటుంబంపై దాష్టీకం

- న్యాయం కోసం పోరాడినందుకు ఏడాదిలో ముగ్గురి బలి
- బీజేపీ పాలిత ఎంపీలో దారుణం
- లైంగిక వేధింపులపై దళిత యువతి ఫిర్యాదు
- ఆమె సోదరుడిని హత్య చేసిన నిందితులు
- తల్లిని వివస్త్రను చేసి దాడి
- సాక్షిగా ఉన్న బంధువూ హత్య
- అంబులెన్స్ నుంచి దూకి బాధితురాలి ఆత్మహత్య

సోదరుడి శవంపై పడి రోదిస్తున్న బాధితురాలు(ఫైల్)

భోపాల్, మే 28: తమ ఇంటి ఆడబిడ్డపై లైంగిక వేధింపులు, దాడికి పాల్పడ్డ వారికి వ్యతిరేకంగా పోరాడటమే ఓ దళిత కుటుంబానికి శాపమైంది. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా కేసు వెనక్కు తీసుకోకపోవడం ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. ఏడాదిలోనే ముగ్గురిని కోల్పోయి అంతులేని విషాదంలో మునిగిపోయింది. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో ఈ దారుణ సంఘటనలు జరిగాయి. సాగర్ ప్రాంతానికి చెందిన ఓ దళిత యువతి(20) తనను లైంగిక వేధించారని, బెదిరించి, దాడికి పాల్పడ్డారని 2019లో నలుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పుడు ఆ యువతి వయసు 15 ఏండ్లు. ఆమె ఫిర్యాదు మేరకు ఆజాద్ ఠాకూర్, విశాల్ ఠాకూర్, పుష్పేంద్ర ఠాకూర్, చోటు రైక్వార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సహా పలు చట్టాల కింద కేసు నమోదైంది. 2020 ఎన్నికలకు కొన్ని నెలల ముందు జరిగిన ఈ సంఘటన అధికార బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ అంశంగా మారింది.

బాధితురాలి తమ్ముడు, బంధువు హత్య

ఎన్నికలు ముగిసిన తర్వాత ఫిర్యాదు ఉపసంహరించుకోవాల్సిందిగా యువతి కుటుంబంపై నిందితుల తరపు నుంచి ఒత్తిళ్లు మొదలయ్యాయి. గత ఏడాది ఆగస్టులో వంద మందికి పైగా ఉన్న ఓ మూక బాధితురాలి కుటుంబంపై దాడికి పాల్పడింది. ఈ దాడిలో ఆమె సోదరుడు(18) మృతి చెందాడు. కాపాడేందుకు ప్రయత్నించిన ఆమె తల్లిపైనా దాడికి పాల్పడి, బట్టలు లాగేసి అవమానించారు. ఈ ఘటనపై కూడా పెద్ద ఎత్తున దుమారం రేగింది. విక్రమ్ ఠాకూర్, విజయ్ ఠాకూర్, ఆజాద్ ఠాకూర్, కోమల్ ఠాకూర్, లాలూ ఖాన్, ఇస్లాం ఖాన్, గోలు సోని, నఫీస్ ఖాన్, వహీద్ ఖాన్‌పై పోలీసులు హత్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో సాక్షిగా యువతి బంధువు ఉన్నారు. దీంతో శనివారం ఆయనను కొందరు వ్యక్తులు ఫోన్ చేసి పిలిపించి సాక్ష్యాన్ని వెనక్కు తీసుకోవాలని బెదిరించారు. ఇందుకు అంగీకరించకపోవడంతో అతడితో పాటు, వెంట వెళ్లిన మరో వ్యక్తిపై దాడికి పాల్పడ్డారు. చికిత్స పొందుతూ యువతి బంధువు మృతి చెందగా, మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది.

యువతి బలవన్మరణం?!

ఆయన మృతదేహాన్ని ఆదివారం సాయంత్రం ఊరికి తీసుకొస్తుండగా బాధిత యువతి వ్యాన్ నుంచి కిందపడి తీవ్ర గాయాలతో కన్నుమూసింది. వ్యాన్ రన్నింగ్‌లో ఉండగా ఆమె ఒక్కసారిగా కిందకు దూకేసి ఆత్మహత్యకు పాల్పడిందని బంధువులు తెలిపారు. బీజేపీపాలిత రాష్ర్టాల్లో మహిళలపై నేరాలు పెరిగిపోయాయని కాంగ్రెస్ ఆరోపించింది.

నర్సును భవనంపై నుంచి తోసేసిన రోగి బంధువులు!

పట్నా, మే 28: బీహార్‌లోని దవాఖానలో ఓ గర్భిణి (25) మరణించటంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఆమె బంధువులు, కుటుంబ సభ్యులు అక్కడ విధ్వంసానికి దిగారు. దవాఖానలోని ఓ నర్సును మొదటి అంతస్తు నుంచి తోసేశారని వార్తలు వెలువడ్డాయి. ఈ దాడి ఘటన ఆదివారం రాత్రి నలంద జిల్లా బీహార్ షరీఫ్ స్టేషన్ రోడ్ వద్ద ఉన్న ఓ ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో చోటుచేసుకుంది. దాడిలో తీవ్రంగా గాయపడ్డ నర్సు పూనమ్ కుమారి (35) పరిస్థితి విషమంగా ఉందని, ఆమెను మరో దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారని తెలిసింది. మూకదాడి నుంచి తప్పించుకునే క్రమంలో నర్సు పూనమ్ కుమారి మొదటి అంతస్తు నుంచి దూకేసిందని పోలీసులు చెబుతున్నారు. అయితే ఈ వాదనను నర్సు భర్త జై కుమార్ ప్రసాద్ ఖండించారు. దాడికి తెగబడ్డవారే తన భార్యను తోసేశారని ఆరోపించారు.

వచ్చే నెలలో కొత్త మార్పులివే..

- *ఉచిత ఆధార్ అప్‌డేట్‌కు జూన్ 14 చివరి తేదీ*
- *ఇకపై ప్రైవేట్ కేంద్రాల్లోనూ డ్రైవింగ్ లైసెన్స్*

న్యూఢిల్లీ, మే 28: వేసవి కాలం దాదాపు ముగిసి, రుతుపవనాల సీజన్ ప్రారంభమయ్యే జూన్ నెల రాబోతున్నది. ఈ క్రమంలో జూన్ 1 నుంచి రోజువారీ మన జీవితంలో కొన్ని మార్పులు చోటుచేసుకోనున్నాయి.

- *ఆధార్ వివరాలను ఆన్‌లైన్‌లో ఉచితంగా అప్‌డేట్ చేసుకొనేందుకు జూన్ 14ను యూఐడీఏఐ చివరి తేదీగా నిర్ణయించింది. ఆ తర్వాత అప్‌డేట్ చేసుకోవాలంటే రుసుం చెల్లించాల్సి ఉంటుంది. అయితే జూన్ 14 తర్వాత అప్‌డేట్ చేసుకోని వారి పాత కార్డు పనిచేయకుండా పోతుందన్న ప్రచారాన్ని యూఐడీఏఐ ఇటీవల ఖండించింది.*
- *కొత్త డ్రైవింగ్ లైసెన్స్ రూల్స్–2024 అమల్లోకి రానున్న క్రమంలో వచ్చే నెల 1 నుంచి ట్రాఫిక్స్ రూల్స్‌లో మార్పులు జరుగనున్నాయి. కొత్త నిబంధనల ప్రకారం.. అధిక వేగానికి రూ.1–2 వేలు, లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.500, హెల్మెట్ లేదా సీట్ బెల్ట్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ.100 ఫైన్‌గా చెల్లించాల్సి ఉంటుంది. మైనర్ డ్రైవింగ్ చేస్తే రూ.25 వేల భారీ జరిమానా విధించడంతోపాటు అతనికి 25 ఏండ్ల వయసు వరకు డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు అవకాశం ఉండదు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ కోసం ఇక నుంచి ఆర్టీఓ కార్యాలయానికి డ్రైవింగ్ టెస్ట్‌కు హాజరుకావాల్సిన అవసరం లేదు. ప్రైవేటు సంస్థలు కూడా డ్రైవింగ్ టెస్టులు నిర్వహించి, సర్టిఫికెట్లను జారీ చేయవచ్చు.*
- *ఆర్బీఐ విడుదల చేసిన లిస్టు ప్రకారం జూన్‌లో బ్యాంకులకు 10 రోజుల సెలవులు ఉన్నాయి. వీటిలో ఐదు ఆదివారాలు, రెండో, నాలుగో శనివారాలు ఉన్నాయి. మిగతా సెలవుల్లో రాజా సంక్రాంతి, ఈద్–ఉల్–ఆధా పండగలు ఉన్నాయి.*

మరో మహమ్మారి తప్పదు

బ్రిటన్ శాస్త్రవేత్త హెచ్చరిక

లండన్, మే 28: కొవిడ్ తర్వాత మరో మహమ్మారి మానవాళిపై దాడి చేస్తుందా? అంటే అవుననే అంటున్నారు యూకే మాజీ ప్రధాన శాస్త్రీయ సలహాదారు పాట్రిక్ వాల్లన్స్. త్వరలోనే జరగనున్న బ్రిటన్ ఎన్నికలపై ఓ మీడియా సంస్థతో ఆయన మాట్లాడుతూ... మరో మహమ్మారి రాక తప్పదని, కాబట్టి వచ్చే ప్రభుత్వం ఇందుకు సంసిద్ధంగా ఉండేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. ఇందుకు గానూ పరీక్షా కేంద్రాలు, వ్యాక్సిన్లు, చికిత్స సదుపాయాలు అందుబాటులో ఉంటే కొవిడ్–19 వల్ల కలిగిన దారుణ పరిస్థితులు మళ్లీ ఉత్పన్నం కాకుండా చూడొచ్చని ఆయన తెలిపారు. ఇందుకు ప్రపంచ సహకారం కూడా అవసరమని అన్నారు. దేశాన్ని రక్షించుకునేందుకు సైన్యం ఎలా ముఖ్యమైనదో, మహమ్మారులను ఎదుర్కొనేందుకు కూడా సంసిద్ధంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.

సైలెంట్‌గా తొలగింపులు

- 2023లో దేశవ్యాప్తంగా ఉద్యోగాలు కోల్పోయిన 20 వేల మంది టెకీలు
- ఏఐఐటీఈయూ గణాంకాల వెల్లడి
- ఉద్యోగులతో స్వచ్ఛంద రాజీనామాలు
- అన్ని స్థాయిల కంపెనీల్లో ఉద్వాసనలు



న్యూఢిల్లీ, మే 28: దేశ ఐటీ రంగంలో నిశ్శబ్దంగా ఉద్యోగుల తొలగింపులు జరుగుతున్నాయి. 2023లో ఐటీ/ఐటీఈఎస్ రంగంలో దాదాపు 20 వేల మంది టెకీలు ఉద్యోగాలు కోల్పోయారని ఆలిండియా ఐటీ/ఐటీఈఎస్ ఎంప్లాయీస్ యూనియన్(ఏఐఐటీఈయూ) వెల్లడించింది. 2024లో భారత టాప్ ఐటీ సర్వీసెస్ కంపెనీల్లో దాదాపు 2–3 వేల మంది ప్రొఫెషనల్స్ ఉద్యోగాలు కోల్పోయారని ఐటీ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్ఐటీఈఎస్ తెలిపింది.

'టెర్మినేటెడ్' ముద్ర పడితే కష్టం

కంపెనీలు ఉద్యోగుల తొలగింపునకు పలు మార్గాలు పాటిస్తున్నాయి. 2–3 నెలల జీతం తీసుకొని స్వచ్ఛందంగా రాజీనామా చేసేందుకు విముఖత వ్యక్తం చేసిన వారిని వెంటనే తొలగిస్తున్నారు. రిలీవింగ్ లెటర్‌పై 'టెర్మినేటెడ్' అనే ముద్ర పడితే మరో ఉద్యోగం పొందేందుకు కష్టమవుతున్నదని ఎన్ఐటీఈఎస్ అధ్యక్షుడు హర్‌ప్రీత్ సింగ్ పేర్కొన్నారు.

అన్ని స్థాయిల కంపెనీల్లో తొలగింపులు

బహుళజాతి స్థాయి కంపెనీల నుంచి చిన్న కంపెనీల వరకు అన్ని స్థాయిల్లో ఈ ఉద్యోగుల తొలగింపుల పర్వం నడుస్తున్నది. అమెరికాలోని శాన్‌డియాగో కేంద్రంగా నడిచే టెరాడాటా కంపెనీ గత ఏడాది చివరిలో హైదరాబాద్ క్యాంపస్‌లో 35–40 మంది ఉద్యోగులను తొలగించినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. అసెంచర్, కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీల్లో కూడా ఇది నడుస్తున్నదని పలువురు ఉద్యోగులు, ఇండస్ట్రీ వర్గాలు చెప్పినట్టు 'మనీ కంట్రోల్' వెబ్‌సైట్ నివేదించింది. ఇన్ఫోసిస్ సంస్థ 2024లో 200–500 మంది ఉద్యోగులను రాజీనామా చేయాలని కోరడం ద్వారా తొలగించిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే ఉద్యోగులను తొలగించినట్టు వస్తున్న వార్తలను ఇన్ఫోసిస్, ఏటూఎస్ గ్రూపు ఖండించాయి.